# ఇంటి దయ్యాలు

శ్రీ ఇసుకపల్లి లక్ష్మీనరసింహశాస్త్రి

హఠాత్తుగా, అర్ధరాత్రి, కంఠం రెండు చేతులతో గట్టిగా పట్టుకుని "నన్ను చంపకండి నన్ను చంపకండి" అంటూ బిగ్గరగా అరిచింది గభాలున ప్రక్కమీద నుంచి లేస్తూ వసంత.

రవి చివాలున లేచి కూర్చున్నాడు.

'ఏమిటే అమ్మా! ఏ మొచ్చిందే నా కొంప మీదికి యీ అర్ధరాత్రి—?' శాంతమ్మ గబగబ వచ్చింది.

రవి యెందుకో ఒక క్షణం గజగజ వణికి పోయాడు.

'ఇదెక్కడి కర్మంరా? ఇట్లా గుడ్లుపెట్టి చూస్తోంది. నాకు కాళ్ళు చేతులు ఆటల్లేదురా నాయనా. ఆ గోపాలంగార్ని న్నా పిలుచుకురారా...' శాంతమ్మ వణుకు ఆపుకో లేకపోతోంది.

'ప్రతిదానికీ నీదో హడావిడి. అసలు సంగతే మిటో కనుక్కోరాదూ? పెద్ద పెట్టున కేక వినిపించే టప్పటికి గభాలున లేచి కూర్చున్నా. కలవరించిందో యేమో' రవి విసుక్కున్నాడు.

శాంతమ్మకు మొదటినుంచీ భయం యెక్కువే. అందులో ఆయన పోయినప్పటినుంచీ యెక్కడలేని భయం ఏర్పడిపోయింది. పైగా అనుమానాల మనిషి. ఆమె మనస్సు యెప్పుడూ మంచి ఆలోచించి యెరగదు. ఏది జరిగినా, దాంట్లో యేదో చెడుభావం ఆమెకు తడుతూనే వుంటుంది. అనుభవించిన ప్రాణం ఇంకో విధంగా ఆలోచించలేకపోతోంది.

వసంత మామూలు ప్రపంచంలోకి వచ్చేదాకా తల్లిని సమాధానపరచలేక సతమతమయ్యాడు రవి.

'అత్తయ్యా' అంటూ వసంత, వక్కపెట్టున శాంతమ్మను కౌగలించుకుంది. శాంతమ్మకు వళ్ళు తెలియడం లేదు. రవి దిగాలుపడి చూస్తున్నాడు.

'అత్తయ్యా నాకేదో కలవచ్చింది. కళ్ళు తెరిచి చూసినాకూడా యేమిటో నిజం అనిపించింది. మళ్ళీ ఆ కలయేమిటో పూర్తిగా తెలీటం లేదు. ఎక్కడో పాడుపడ్డ బావిట. అక్కడ ఎవరో పిచ్చివాడు... నాకు భయంవేస్తోంది' వసంత మళ్ళీ శాంతమ్మ దగ్గరకు జరిగింది.

'ఆ...అబ్బాయి...' గొంతులోనే నిలిచిపోయినాయి మిగతామాటలు శాంతమ్మకు.

శాంతమ్మ మొహం చూసేటప్పటికి వసంత భయం మరీ యెక్కువయింది.

రవికూడా యేదో ఆశ్చర్యంగానే ఆలోచిస్తున్నట్లు చూశాడు తల్లి వైపుకు.

'అత్తయ్యా అత్తయ్యా' అంటూ వసంత పిలిచినా పలకటం లేదు.

'అమ్మా యేమిటే అట్లా చూస్తావు' అని రవి అన్నా మాట్లాడటం లేదు శాంతమ్మ.

ఈసారి రవికే యెక్కువ భయం వేసింది.

'అబ్బాయీ అక్షరాలా నిజమయిందిరా నేనేం చేస్తానురా' కొంచెం యేడుపుకూడా సాగించింది శాంతమ్మ.

'గోపాలంగార్ని పిలుచుకువస్తాను వుండు' అంటూ లేచాడు రవి. 'నాకు భయం వేస్తోంది నేనూ వస్తాను' అంటూ వసంత లేచింది.

వీళ్ళిద్దరు భయపడిపోవటం శాంతమ్మకు తెలిసింది.

'ఒరేయి రవి. ఇప్పుడు ఆయన వచ్చి యేం చేస్తాడు. తెల్లారి చూద్దాంలే' అంటూ పట్టు బిగువున ఆ మాటలు అంది.

వసంతకు రవికి కొంచెం ధైర్యం వచ్చింది.

'నువ్వు అట్లా అంటూంటే మాకు భయం వెయ్యదు. ఏమిటో అసలు విషయం చెప్పకుండా ఏమిటది?' రవి కొంచెం చిరాకుగా అన్నాడు.

'ఏమిటె అట్లా అన్నారు' రెట్టించింది వసంత.

'ఎట్లాగూ అనలేదు కాని పడుకోండమ్మా!' శాంతమ్మ ఆలోచనల్లోకి యెన్నో విషయాలు వస్తున్నాయి.

మెల్లిగా అక్కడినుంచి లేచి సావిట్లో మంచం మీద వాలింది శాంతమ్మ.

'ఏం లేదు కాని వెళ్లి పడుకో'—రెండుసార్లు అడిగినా శాంతమ్మ వకటే సమాధానం చెప్పింది రవికి.

ఆ రాత్రల్లా రవి వసంతలకు, శాంతమ్మను గురించిన భయమే. వసంత మనస్సులో వున్న భయం రవికి చెప్పలేదు. రవి మనస్సులోవున్న అనుమానం వసంతకు చెప్పలేదు. ఇద్దరూ శాంతమ్మ భయానికి కారణాలు వూహిస్తున్నట్లు ఆలోచించుకుంటున్నారు. శాంతమ్మ కంటిమీద కునుకు లేదు. తన జీవితంలో గతంలో జరిగిన విషయాలన్నీ వక్కొక్కటే స్ఫురణకు వస్తున్నాయి. భయంవేస్తున్నా ఆశ్చర్యపడుతున్నా, లోపలలోపలే బాధపడిపోతోంది శాంతమ్మ. వసంతకలకు అప్పుడే యేదో అర్థం తట్టింది శాంతమ్మకు. ఆ అర్థం బలం అవటానికి దానికి తగ్గట్టుగా యెన్నో ఆలోచించుకుంటోంది. అన్నీ అనుగుణంగానే కనిపిస్తూవస్తున్నాయి. అందువల్లనే శాంతమ్మకు భయంకూడా యెక్కువయింది.

ఒకటి రెండుసార్లు దగ్గరకు వెళ్లటానికి ప్రయత్నించింది వసంత. రవిని రమ్మని అడిగింది. రవి రానని కచ్చితంగా చెప్పేశాడు. ఒంటరిగా శాంతమ్మదగ్గరికి వెళ్లలేకపోయింది. ఒకసారిమాత్రం మెల్లిగా మంచం మీద కూర్చుని శాంతమ్మ మంచం వైపుకు చూసింది వసంత. అప్పుడే దుప్పటి తీసి గదివైపుకు చూస్తున్న శాంతమ్మ రెండు కళ్ళూ కనిపించినాయి వసంతకు. దడ్డటిల్లిపోయి గభాలున ముసుగు పెట్టుకుంది వసంత. మళ్లీ తెల్లారేదాకా కదలనన్నా కదల్లేదు.

వసంత కాపరానికివచ్చిన కొత్తలో తాను యీ యింట్లో యెట్లావుండాలో అర్థం అయ్యేది కాదు. తన పుట్టింటికీ యీ యింటికీ చాలా తేడా కనిపించింది. తానొక్కత్తే అవటంవలన తల్లి గారాబం పెంపకం కూడా యీ భేదాల్ని బాగా చూపించ గలిగింది. అవుతే తాను జీవితాంతంవరకూ వుండాలసిన చోటుకు వచ్చానని కొద్దిరోజుల్లోనే తెలుసుకో కలిగింది వసంత. శాంతమ్మ ప్రకృతి మొదట యెంత కటువుగా అనిపించిందో యిప్పుడు అంత సన్నిహితంగా అనిపిస్తోంది. శాంతమ్మ తనకు శత్రువు కాదు అని తెలుసుకోవటానికి నిజానికి కొన్ని రోజులు పట్టినమాట యితేవాస్తవమే. శాంతమ్మ ప్రవర్తనకంటే రవి ప్రవర్తనే చాలా బాధగాను భయంగానూ వుంటూవచ్చింది వసంతకు. శాంతమ్మ మధ్యవర్తిగా వుండి సమన్వయించుకుంటూ వస్తోంది. ఇప్పటికీ కూడా వసంత, రవిని బాగా అర్థం చేసుకోలేదనే చెప్పాలసివస్తుంది. రవి కూడా వసంత మనస్సు పూర్తిగా తెలుసుకుని ప్రవర్తిస్తున్నట్లు వుండడు. కాని ఎవరికి తగిన కారణాలు వాళ్లకు వుండనే వున్నాయి. మొదటి నుంచీ కూడా శాంతమ్మ యేదో కట్టుబాట్లలో వుంచాలని ప్రయత్నిస్తున్నట్లు వసంతకు అర్థం అవుతోంది. అంతకంటే కూడా అతిముఖ్యమైన విషయాన్ని తనదగ్గర దాస్తోందా అన్న అనుమానం అప్పుడప్పుడు శాంతమ్మ ప్రవర్తన వల్ల, వసంతకు కలుగుతూవుంటుంది. తన చనువు నెప్పుడూ కూడా యీ విషయాన్ని అడగటానికి వుపయోగించుకోలేదు. ఈ విషయాన్ని యితరుల ద్వారా తెలుసుకుందామనే ఆసక్తికూడా వసంతకు లేదు. ఎవరైనా యే సందర్భంలోనైనా, తన యింటి మాటలు కనక యెత్తారంటే చివాలున లేచివచ్చేస్తుంది. తమ విషయాలు యింకోళ్లకు యెందుకో అనేది ఆమె భావం. ఇష్టాగోష్టిగా మాట్లాడుకోవటం మినహాయిస్తే యెన్నడూ కూడా తాను యింకోళ్ల విషయాల్లో లోతుపాతులు తెలుసుకోవటానికి ప్రయత్నించలేదు. అవుతే లోకులు వూరుకోవటం లేదు. ఇలా బావిదగ్గరకు వెళ్ళినా, ఎక్కడైనా పేరంటంలో కలిసినా, యేవేవో అడుగుతూనే వుంటారు. వినీ వినిపించుకోకుండా తప్పించుకు వస్తూనే వుంటుంది సాధ్యమైనంతవరకు వసంత. 'బంగారంవంటి పిల్ల వచ్చిపడింది, యీ కొంపలోకి' అన్నమాటలు అతి తేలికగా తీసేసింది అప్పట్లో. తర్వాత తర్వాత యెప్పుడైనా ఆ మాటలు జ్ఞాపకంవస్తే యేవేవో అర్థాలు ఆమెకు స్ఫురించేవి. దాన్ని గురించి ఆలోచనే మానేసేది, వికృతమైన అర్థం వస్తూ వుంటే.

'ఏమోలే యెవరి అదృష్టం యెలావుందో యెవరు చెప్పగలరు. ఈయన సరిగ్గా వుండకూడదూ! తాను యెంత తప్పించుకున్నా యీ మాటలు వినటం తప్పలేదు వసంతకు. పెద్ద ఉక్రోషంకూడా వచ్చింది. ఆ కోపంలో యేదో అనేసింది కూడా. కాని ఆమాటలు యిప్పుడు తలచుకుంటూవుంటే వళ్లు యెందుకో జలదరించిపోతోంది. వాళ్లమీద కోపంలో వాళ్ల మాటల్లో భయం తెలీలేదు అప్పట్లో. ఇప్పుడిప్పుడు బాహాటంగానే వినకూడదనుకున్నవి అనేకం వింటోంది వసంత.

'పార్వతమ్మా! అప్పుడే మరిచేపోయినావా. పిల్లాన్ని బ్రతకనిచ్చేవాడేనా ఆసమయానికి రాముడు కనక అడ్డం రాకపోతే. ఆ పిచ్చిలోకూడ రాముడంటే అంత భయం పెట్టాడు కాబట్టే అంతమాత్రంతోనన్నా సరిపోయింది. లేకపోతే యింకేమన్నా వుందా.' ఈ మాటలు ఎన్నోసార్లు వసంత చెవుల్లో ప్రతిధ్వనించటం మొదలు పెట్టినాయి. కాని యిదమిత్థమని యే అర్థం కూడ ఆమెకు తట్టటంలేదు. కాని యెందుకో తెలియని భయం మాత్రం వేస్తోంది యీ మాటలు జ్ఞాపకం వచ్చినప్పుడల్లా. తననుగురించేనా యీ మాటలు. తనకోసం కాకపోతే తాను అక్కడకువెళ్లినప్పుడే యెందుకు అనాలి. వీళ్లంతా తన జీవితంలో యెందుకు జోక్యం చేసుకుంటారు? తనమీద అవసరంలేని శ్రద్ధ వాళ్లకెందుకు? ఏదైనా అంతరార్థం వుందా? వసంత మనస్సు యెన్నోవిధాల ఆలోచిస్తూవుంటుంది యెప్పటికప్పుడు. ఒక్కొక్కప్పుడు తాను మనస్సులో అనుకుంటున్న విషయాలకు ఆమాటల్లోని అర్థం సమన్వయం అయినట్లు కనిపించినప్పుడు వళ్లంతా వణుకు పుట్టుకొస్తూ వుంటుంది. ఆ క్షణంలో వాళ్ల దగ్గరకు వెళ్లి అంతా అడిగెయ్యాలనుకుంటుంది. మరుక్షణంలోనే మళ్లీ మనస్సు మార్చుకుంటుంది. 'అడదాని అదృష్టం అంటూ ఒక తేపట్టుకు వదలకుండావున్నావు. స్వతహా పిచ్చివాడై కూర్చుంటే ఆడది వచ్చి యేం చేస్తుందమ్మా నీదంతా విడ్డూరం కాని.' ఈమాటలు వసంతను మరింత బాధ పెటుతూవుంటాయి. వెంటనే రవి జ్ఞాపకం వస్తాడు, ఎందుకో భయం వేస్తుంది. మళ్లీ తానే సమాధాన పడుతుంది. శాంతమ్మను అడుగుదామని యెన్నిసార్లు ప్రయత్నించినా తన అంతరాత్మ వద్దని చెపుతూనే వుంటుంది యెప్పటికప్పుడు. అటు వాళ్ళ మాటలు వినటం తప్పటం లేదు. ఇటు అత్తగార్ని అడగటానికి సాహసించటంలేదు. కాని యిప్పుడిప్పుడే అందరూ అంటున్న మాటల్లో తన జీవితానికి కావలసిన అర్థం యేదో వుందని మాత్రం గట్టిగా ఒక నిర్ణయానికి వచ్చేస్తోంది. అందువల్లనే భయం కూడా యెక్కువయి పోతోంది. ఏ మాట ఏ క్షణంలో తలచుకున్నా ఆ మాట తాను అనుకుంటున్న అనుమానాన్ని బలపరుస్తూనే వస్తోంది. ఆ మాటలన్నీ వసంత చెవుల్లో గింగురుమంటూ తిరుగుతూ వుంటున్నాయి. ఆమె మనస్సు కూడా ఆ మాటలవైపుకే మొగ్గుచూపిస్తూ వుంటుంది.

వసంతలో వస్తున్న మార్పును జాగ్రత్తగానే కనిపెడుతూ వస్తోంది శాంతమ్మ. రాత్రి సంఘటన జరిగినప్పటినుంచీ, వసంతను చూస్తూవుంటే శాంతమ్మకు తన గతచరిత్రంతా నిమిషంలోకి జ్ఞాపకం వస్తుంది. శాంతమ్మను చూస్తే వసంతకు విపరీతమైన భయం యేర్పడిపోయింది. వీళ్ళిద్దరి మధ్య సతమతమయ్యే వ్యక్తి రవి ఒక్కడే.

'అబ్బాయ్ నేను చెప్పిన సంగతి యేమన్నా విచారించావుట్రా?' నీరసంగా అడిగింది శాంతమ్మ.

'ఆయన వూళ్లో లేడులే, మరి ఇంకెవ్వరికి పట్టిందో దయ్యం' అనేశాడు రవి వెనకముందు ఆలోచించకుండానే.

'ఏమిట్రా నోటి దూకుడు' శాంతమ్మ, వసంత వైపుకు చూసింది.

వసంత ముద్దయిపోయింది.

రవి తాను తొందరపడ్డానేమో అనుకున్నాడు, తల వంచుకుని వెనక్కు తిరిగివెళ్లిపోయాడు.

'ఏమిటి అట్లా చూస్తున్నావు. కొంచెం విభూతి తెమ్మని చెప్పాను. విభూతి పెట్టుకుంటే చెడు కలలు అవీ రావు. అంతకంటే యేం లేదు.' వసంతముఖంలో మార్పుకోసం యెదురుచూసింది శాంతమ్మ.

వసంత యేమీ మాట్లాడలేదు. తాను అనుకుంటున్న విషయానికి వసంత మౌనానికి సరిపోయింది. వసంతలో యేవిధమైన మార్పూ రాకూడదని శాంతమ్మ ఆవేదన. కాని తన ఆవేదన యేవిధంగా వసంతతో చెప్పకలుగుతుంది. ఎప్పుడు అడిగినా వెతుక్కోకుండా 'ఏంలేదని' సమాధానం చెపుతుంది వసంత. ఇంకా యేవిషయాన్నిగురించైనా అడిగె సావకాశమే లేదు శాంతమ్మకు. పోనీ గట్టిగా కోప్పడి

అడిగేద్దామనుకున్నా, దానివల్ల వసంతలో యేవిధమైనమార్పు వస్తుందో అనే భయం. అంత ఆదుర్దా పడుతున్నా, తన ప్రవర్తనవల్ల వసంతకు ఒకవిధమైన భయం కలుగుతోం దనే విషయంమాత్రం శాంతమ్మ గ్రహించినట్లు ప్రవర్తించదు. ఇటు రవి దూకుడుగా మాట్లాడటం యివ్వాళ క్రొత్తవిషయం కాకపోయినా, ఆమాటలకు అర్థం వసంతకు వికటంగానే తోస్తోంది. రవి తనమాటలవల్ల యితరులు యేవిధంగా బాధపడతారో తెలిసినా, ఆవిషయం, తాను అన్నతర్వాత గాని పూర్తిగా గ్రహించుకోలేకపోతున్నాడు. ఎప్పటికప్పుడు యేదో అనటం తర్వాత యెందుకు అన్నానా అని ఆలోచించటం రవికి బాగా అలవాటైపోయింది. ఆ అలవాటే వసంతకు వివిధరకాలుగా ఆలోచించటానికి అవకాశం యిస్తోంది. అటు రవి ఆపుకోలేడు మాటలు. ఇటు వసంత మానలేదు ఆలోచించటం. అటు అత్తకు యిటు భర్తకు మధ్య సతమత మయిపోతోంది వసంత.

రవి హఠాత్తుగా వచ్చాడు.

'ఇప్పుడే ఆయన వూరినుంచి వచ్చాడు. ఇదిగో పొట్లాం. పడుకునేటప్పుడు యింత నుఖాన రాయి. ఎందుకైనా మంచిది నువ్వుకూడా యింత రాసుకో' తల్లివైపుకు విసిరాడు ఆ పొట్లాన్ని రవి.

వసంత నిశ్చేష్టురాలయిపోయింది. శాంతమ్మ రవివంకచూస్తూ నిలబడిపోయింది యేమీ అనలేక.

రోజురోజుకూ రవి మాటల ధోరణిలోకూడా పూర్తి మార్పు వస్తున్నట్లు వసంత అనుమానాలు దృఢమయిపోతున్నాయి. రానురాను రవంటే కూడా విపరీతమైనభయం యేర్పడిపోతోంది వసంతకు.

"ఏమండీ అత్తయ్యా యేమిటి అట్లా మాట్లాడటం మొదలుపెట్టారు" వసంత అడిగింది. తన హృదయంలో నలుగురు అన్నమాటలు ప్రతిధ్వనించినాయి.

"ఎట్లా మాట్లాడుతున్నాడే నీదంతా చిత్రం కాని...." గట్టిగా మందలిద్దామనుకుంది. కాని వసంత ప్రవర్తన చూస్తూవస్తున్న శాంతమ్మకు సమ్మతంగా లేదు. ఇటు కొడుకుతోను యేదీ గట్టిగా మాట్లాడటానికి వీల్లేదు. నోటిదూకుడు, ఏమంటాడో అనే భయమే. కోడలితో యేదైనా చెపుదామన్నా, అసలే పిరికిది యేం భయపడుతుందో అని అనుమానం. ఇద్దరిమధ్య సతమతమయిపోతోంది శాంతమ్మ.

'నా జీవితంలో యెంతోమందిని చూశాను అటు పిచ్చివాళ్ళను, ఇటు మంచివాళ్లను. ఇద్దరిలో తేడాలు నిమిషంలో కనిపెట్టేస్తా, దయ్యాలు యెవరికి పడతాయో కూడా నాకు తెలుసు, వట్టి పిరికివాళ్లకు పడతాయి. ధైర్యంగావుంటే దయ్యాలు ఏడు ఆమడల దూరంలో వుంటాయి. మన పిరికే పిచ్చి, దయ్యంపట్టటం. ఇది నేను గట్టిగా కనకఅమ్మతో అంటే సరి, నాకుకూడా పిచ్చియెక్కిందనో, దయ్యం పట్టిందనో అనుకుంటుంది. అదే పిరికితనం ఏమంటావు వసంత' రెండుచేతులు గట్టిగా పట్టుకుని పక్కున నవ్వేశాడు రవి.

వసంతకు ముచ్చెమట్లు పట్టినాయి, పంజరంలో పక్షిలాగ గిలగిల కొట్టుకుంటోంది ప్రాణం. ఆ చేతుల్లోంచి తప్పించుకుని అవతల పడదామని విశ్వప్రయత్నం చేస్తోంది వసంత. ఈ విషయం కనిపెట్టిన రవి గట్టిగా ముందుకు లాక్కున్నాడు. వసంత, ముఖం అటు త్రిప్పేసి కెవ్వున కేక పెట్టింది. శాంతమ్మ గదిలోకి వచ్చేలోగానే ఫెళ్లున చంపమీద కొట్టాడు వసంతను రవి.

'అయ్యో! అయ్యో! నీ చేతులు విరిగిపోను. ఎంతపని చేశావురా, సిగ్గులేదుట్రా. ఆడదానిమీద చెయ్యిచేసుకున్నావు' శాంతమ్మ, వసంతను దగ్గరకు లాక్కుంది.

'సిగ్గు నాకెందుకో. ఆడదానికి వుండాలి. నేను మగాణ్ని...' మీది మీదికి వస్తున్నాడు రవి.

వసంత గజగజ వణికిపోతోంది, శాంతమ్మ లేని ధైర్యం తెచ్చుకుని రవిని విదలించేసి లోపలకు తీసుకువెళ్లింది వసంతను; రవి చిరాకుగా వీధిలోకి నడిచాడు.

'వెధవమాటలూ వాడూనూ. ఏముంది పోకిరీ చేష్టలు, పోకిరీ వేషాలూను. అబ్బ అయిదువేళ్లు తేలిపోయినాయే, పాపిష్టి చెయ్యి.' వసంతను ఓదారుస్తోంది శాంతమ్మ.

వసంతకు చెంపదెబ్బకంటె రవి మాటలు యెక్కువ బాధగావున్నాయి. మళ్ళీ నలుగురు అంటున్న మాటలు వసంతకు వినిపిస్తున్నాయి. ఏవో పిచ్చికళలు అబ్బకండా వుంటాయా. అందులో ఆయనది సామాన్యమైన పిచ్చికూడా కాదుట. నిమిషం

లోకి వసంత మనస్సు యెన్నో విషయాలు ఆలోచించేస్తోంది. శాంతమ్మ చెపుతున్న యేమాటలుకూడా వినిపించుకోవటంలేదు. తనకు సంతృప్తిగా వుండే మాటలు చెప్పేస్తోంది శాంతమ్మ. వసంత గుండెమీద యెత్తలేని బరువు వుంచినట్లు బాధపడుతోంది. వసంత ఆలోచన అతివేగంగా అన్నివిషయాల్లోకి పోతోంది. వసంతకు అదివరకు అనుమానాలుగా కనపడుతున్న విషయాలు యిప్పుడు నిజాలుగానే కనిపిస్తున్నాయి. వాటికి యేవిధమైన రుజువులు అక్కర్లేదు. తాను వక నిశ్చయానికి వచ్చేస్తోంది. శాంతమ్మ యెలాంటి ప్రయత్నాలుకూడా వసంత నిశ్చయానికి రావటాన్ని ఆపలేకపోయినాయి. తలుచుకున్నప్పుడల్లా గుండె ముక్కలు ముక్కలయిపోతోంది. తన దుఃఖాన్నంతా లోపల లోపలే మింగుకుంటూ పైకి మాత్రం మామూలుగానే వున్నట్లు కనిపించాలని ప్రయత్నం చేస్తోంది వసంత.

'ఏమిటే జడన్నా వేసుకోకుండా అట్లా తీరిగ్గా ఆలోచిస్తూ కూర్చున్నావు. యెప్పుడూ యేదో వకటి ఆలోచిస్తూ మనస్సు పాడుచేసుకుంటా వేమిటి ? నీకే చెప్పేది...'

శాంతమ్మ పూర్తిగా అనకముందే, వసంత గదిలోకి వెళ్లిపోయింది. కాని గదిలో కూడ యెక్కువసేపు వుండలేకపోయింది. తన మనోవేదన కొంచెమైనా బైటకు వెలువచ్చితే కాని, తాను నిలవలేనను కుంది. అయినా సాహసం లేదు చెప్పటానికి మధనపడుతూ మళ్ళీ సావిట్లోకి వచ్చేసింది.

'ఏమిటే అమ్మాయీ మరీ రోజురోజుకు పూచికపుల్లలాగ అయిపోతున్నావు. ఇప్పుడు నీ ఆరోగ్యం కాపాడుకోవటం ఇదివరకుకంటే కూడా చాలా అవసరం. చిన్నపిల్లవు. నీకు తెలీదు. ఇలారా !' వసంతను పిలిచింది శాంతమ్మ.

'అత్తయ్యా' అంటూ వళ్లోకి వరిగింది వసంత, కళ్లనీళ్లు పెట్టుకుంటూ. శాంతమ్మకు యేదో అర్థమయినట్లు అనిపించింది. మెల్లిగా వోదారుస్తోంది కూడా. ఏదో జాలిగా ప్రార్థేయపడుతున్నట్లు శాంతమ్మ ముఖంలోకి చూసింది వసంత.

'అత్తయ్యా నేను యేం పాపం చేశాను—నేను మీదగ్గర యేదైనా దాచానా? నాకు యీ యింట్లో మీకంటే యింకెవరు...' కంఠం వణికింది వసంతకు.

శాంతమ్మ వళ్లు ఝల్లుమన్నది.

'ఏమిటే ఆ మాట. అనరానిదీ తెలీదు—అనొచ్చింది తెలీదు.' అదోవిధంగా చూసింది శాంతమ్మ వసంతవైపుకు.

వసంతకు శాంతమ్మ భావం అర్థమయినట్లే అనిపించింది. వెంటనే వణుకు పుట్టుకువచ్చింది కూడ. అంత పెడర్థంగా శాంతమ్మ అనుకుంటుందని వసంతకు మొదట్లో తట్టనేలేదు. ఇద్దరు కొద్ది క్షణాలు అట్లాగే వుండిపోయారు. ఆ క్షణాల్లో యిద్దరూకూడ మళ్లా మొదటి ఆలోచనల్లోకే వచ్చేశారు.

'ఏమిటి చెప్పరా నాతో...' ధైర్యంగా అడిగింది వసంత.

శాంతమ్మకు యెన్నాళ్లనుంచో వసంతతో చెప్పుదామనే వుంది. కాని వసంత భయపడిపోతుందనే వుద్దేశంతోనే యెప్పటికప్పుడు వెనక్కు తగ్గుతూ వచ్చింది. ఇప్పుడవుతే కాస్తో కూస్తో తాను దాద్దామనుకున్న విషయం వసంతకు తెలిసినట్లు తాను తెలుసుకుంది. ఇక విపులంగా చెప్పకుండా వుండటంలో అర్థము యేమీలేదు. రేపో మాపో అంతా పూర్తిగా తెలుసుకుంటే తాను దాచినది అవటంకంటే వేరే ప్రయోజనం యేమీవుండదు. అన్నీ ఆలోచించే వసంతా అని పిలిచింది శాంతమ్మ.

'...అసలే భయస్థురాలివి. ఎక్కడ భయపడిపోతావో అని నా ఆదుర్దా, అంతకంటె యేంలేదు లేకపోతే నీదగ్గర దాచే విషయము యేమున్నా వుంటుందా...మీ మామగారికి మొదటినుంచీ యీ జబ్బు లేదమ్మా. నా కాపరం గడ్డలయిపోయినప్పుడు వీడికోసం వక కష్టంపడి వక కష్టంపడకుండా వున్నాననుకున్నావా. అయిదేళ్లదాకా వకటే నానుడుగా వుండేవాడు. తలోకమాటా అంటూ వచ్చారు. ఎవరి మాట వినేటట్లు? గాలనీ ధూళని వకటేమిటి, అన్నింటికీ చేయించాము...ఆనాడు పూజ చేస్తూవుంటే, వున్నవాడు వున్నట్లుగా కూలబడిపోయారమ్మ. అప్పటినుంచీ వారి పద్ధతే మారిపోయింది. పిచ్చిమాటలు పిచ్చిచేష్టలు ఎన్ని బాధలు పడ్డానని, ఎన్ని దెబ్బలు తిన్నానని ఆ భగవంతునికే యెరిక...ఈనాటికి మీయిద్దరూ నాకంట కనపడుతూవున్నారు కాబట్టి అన్నీ వెనకపడిపోయినాయి.' శాంతమ్మ కళ్లనీళ్లు పెట్టుకుంది.

‘అత్తయ్యా, పిచ్చి యెవరికైనా హఠాత్తుగా వచ్చేస్తుందేమిటి? మామగారికి హఠాత్తుగా వచ్చిందన్నారు..’ వసంత అతి ఆదుర్దాగా అడిగింది.

‘అదంతా యెందుకులే యిప్పుడు. ఏదో కర్మం కొద్దీ వచ్చింది. అనుభవించాను.’ శాంతమ్మమాట తప్పించటానికి ప్రయత్నించింది.

‘అత్తయ్యా, మామగారివంశంలో అదివరకు యెవరికైనా వచ్చిందా’—కొంచెంసేపు ఆగి అడిగింది వసంత.

‘ఎక్కడో నాలుగోతరంలో వుందిటమ్మ. అది మళ్లా వీరికే రావాలీ? నాకర్మకాకపోతే.’ శాంతమ్మ కళ్ళు తుడుచుకుంది.

వసంత యేమీ మాట్లాడలేకపోయింది. తాను కోరినసమాధానం అత్తగారిదగ్గరనుంచి వచ్చిందనుకున్నది. సమాధానం వచ్చిందనే తృప్తేకాని, ఆ సమాధానాన్ని గురించి పడేబాధకు తయారుగాలేదు వసంత. తన మనస్సులోకి వెనకటి వన్నీ వక్కొక్కటే వచ్చి, భయపెట్టిపోతున్నాయి. తాను యెంత నిబ్బరంగా వుందామని ప్రయత్నిస్తున్నా, శాంతమ్మ సమాధానాలు మాత్రం అట్లా వుండనీయటంలేదు. శాంతమ్మకూడా వసంతముఖంలో మార్పును యేదో అర్థంచేసుకుంటూనే వుంది. తాను చెప్పకండా వుండదలచుకున్నది చెప్పేసింది. ఇక వచ్చే యేమార్పుకైనా తనదే బాధ్యత అనుకుంటోంది. వసంతను సమాధానపరిచి తృప్తిపరచవలసిన బాధ్యత తనమీద యెక్కువయినట్లు శాంతమ్మ బరువుగా కనిపించింది. మళ్లీ ఆ సంభాషణను పొడిగించేవుద్దేశం, యిద్దరిలోను లేదు. ఇద్దరూ ఆలోచిస్తూ అట్లాగే కూర్చుని వున్నారు.

రవి తటాలున తలుపుతీసి లోపలకు వచ్చేశాడు తీవ్రంగా యిద్దరివైపుచూస్తూ. వసంత రవిముఖం చూడలేకపోయింది. కొంచెం శాంతమ్మకు దగ్గరగా జరిగింది. రవి చిర్రుమన్నాడు. శాంతమ్మ మొహం చిటచిటలాడింది. సరాసరి గదిలోకివెళ్లి ‘వసంతా’ అంటూ గట్టిగా పిలిచాడు రవి. వసంతగుండె దడదడ కొట్టుకుంది. శాంతమ్మ ఆశ్చర్యంగా వసంతవైపుకు చూసింది.

‘ఎందుకు పిలిచింది. నాతో చెప్పు. ఏంపనో’ శాంతమ్మ గదిలో కూర్చున్న రవిదగ్గరకు వెళ్లింది.

‘నిన్నెవరు పిలిచారమ్మా, నువ్వొస్తావు...?’ కసురుకున్నాడు రవి.

‘అమ్మాయ్ వసంతా వకసారి యిటురా అమ్మా. ఏమిటోరా తెగ భయపడిపోతోంది. ఎందుకో అర్థం కావటంలేదు.’ వస్తున్న వసంతవైపుకు చూసింది శాంతమ్మ.

రవికూడా అడుగుతున్నట్లే వసంతవైపు చూశాడు. రవి చూపులు వసంత భరించలేకపోయింది.

‘ఏమిటే ఆ చప్పుడు వంటింట్లో నేనా? నేను చూసివస్తాను వుండు’ శాంతమ్మ వంటింట్లోకి చకచక నడిచింది.

ప్రత్యేకంగా తాను వెళ్లిపోవాలని వెళ్లిపోయిందని వసంత తెలుసుకుంది. వెంటనే తన భయంకూడ యెక్కువయిపోయింది. ఆ భయంలో అడుగు యెటు వెయ్యటానికి తోచక అట్లాగే నిలబడిపోయింది.

‘వసంతా! నేను వట్టి దుర్మార్గుణ్ణి. నాకు కోపంలో యేమీ తెలీదు. నిన్ను యెంత దెబ్బ కొట్టాను. ఇటురా, నేను సరదాగా నిన్ను పిలుస్తుంటే నువ్వెంత కేకపెట్టావు. నేను యేంచేస్తానని. నీకెందుకు నన్ను చూస్తే అంతభయం. నాతో చెప్పవా?’ రవి జాలిగా ప్రాధేయపడ్డాడు.

వసంత, రవి యీ విధంగా మాట్లాడుతాడని యెప్పుడూ అనుకోలేదు, అయినప్పటికీ, రవి మాటలు, వసంత హృదయంలో కొంత మార్పు తెస్తున్నట్లు కనిపిస్తున్నాయి. ఆ క్షణంలో వసంతకు, రవి తన భర్తగానే కనిపించాడు. వసంత హృదయం వుప్పొంగిపోయింది. తాను యేమనాలో తన కేమీ తోచటంలేదు, తన హృదయంలోని బరువు మెల్లిగా తీసేస్తున్నట్లనిపించింది. పెదిమలు ముందుకురానిస్తూ, ఒక్కముఖం వేసుకుని, సహజమైన కన్నీరు పెట్టుకుంది వసంత. రవి ఆప్యాయంగా కళ్లనీళ్లు అద్దుతూ, వసంతను దగ్గరకు తీసుకున్నాడు. వసంత ఆనందంతో కంపించిపోయింది. ఎన్నెన్నో మాటలు మాట్లాడుకుంటున్నారు. ఏవేవో చెప్పుకున్నారు. వసంతకు తన జీవితంలో యింత హాయిగా వున్నరోజు మరొకటి కనిపించలేదు.

ఆరాత్రి పన్నెండు కొట్టగానే వసంత హఠాత్తుగా ప్రక్కమీదనుంచి లేచి కూర్చుంది. చిరునవ్వు

ముఖంతో చేతులు తప్పించుకున్నట్లు ప్రయత్నం చేస్తోంది. బలవంతాన కళ్లు తెరవగలిగింది. నిద్రపోతూవున్న రవి ముఖంలో యెక్కడలేని అందం తాండవమాడిపోతోంది. ఆ ముఖంవైపు వరిగింది. అప్పటికిగాని తాను అనుభవిస్తున్న ఆనందం అంతా కలలో అని తెలియలేదు. రవి ముఖంలోకి అదేపనిగా ఆలోచిస్తూ చూస్తూ కూర్చుంది. తన ఆలోచనల్లోకి అనేక ఊహలు పరుగెత్తినాయి. రవిని లేపుదామనుకుంది కూడ. కాని తనకే సిగ్గేసి మళ్ళీ నడుం వాల్చింది. ఆ రాత్రి తెల్లవారటం వక్క క్షణంగా తెల్లవారిపోయినట్లనిపించింది. వసంత యీ అనుభవం అంతా శాశ్వతంగానే వుండిపోతుం దనుకుంది. శాంతమ్మ కూడా వసంతను చూసి మురిసిపోయింది. వసంత మెనకులోనుంచి అదివరకు స్థావర మేర్పరచుకున్న అభిప్రాయాలు పూర్తిగా తొలిగిపోవటంలేదు. పైపెచ్చు, రవి ప్రవర్తనకు సమర్థనీయంగానే వున్నాయి కూడా. రవిలో యీ హఠాత్తు మార్పు కూడా అలాంటి లక్షణమే ననే వక నిర్ణయానికి రావటానికి వసంతకు యెన్నో రోజులు పట్టలేదు. తాను ఆనాడు రవిదగ్గర వున్నానని తలుచుకున్నప్పుడల్లా, విపరీతమైన భయం, వణుకు పుట్టుకొస్తున్నాయి. శాంతమ్మ, వసంతలో వస్తున్న మార్పులను గమనించినంతగా, రవిలో వస్తున్న మార్పులను గమనించలేకపోతోంది. అందువల్లనే వసంతనుగూర్చిన తన అభిప్రాయాలను మార్చుకోవలసిన అవసరం శాంతమ్మకు యేమీ కలగటంలేదు.

ఆనాడు శాంతమ్మ గడపలో ముగ్గులు పెడుతూనే, 'కాఫీ త్రాగటం అయిందిగా, యిక బజారు వెంటపడ్డావు, ఏమైనా కూరలన్నా తెచ్చిపడెయ్యి,' అన్నది, తీవ్రంగా పోతున్న రవిని ఆపుతూ.

'ఇవ్వాళ, మధుగారింట్లో భోజనాలు మరిచేపోయా వేమిటి' అన్నాడు రవి.

'ఎంత వుప్పాయి వచ్చిందిరా. వాళ్లింటికి భోజనానికి వెళ్లాలీ! కూతురికి రెండోపెళ్లి చేస్తున్నాడని వూళ్లో యెవరూకూడా వాళ్లింటికి వెళ్ళకూడదనుకుంటుంటే...'

'మొగుడుచస్తే, రెండోపెళ్లి చేసుకోరూ? పెళ్లాం చస్తే చేసుకోవటంలా. బ్రతికుండగానే భర్త? చచ్చిన తర్వాత యెవరికియెవరో...' రవి ఆవేశంలో యింకా యేవేవో మాట్లాడాడు.

'నోటికి యెంతొస్తే అంత అనెయ్యటమే. ఛీ! పాడుబ్రతుకు' శాంతమ్మ యింట్లోకి వెళ్లిపోయింది.

వసంత వంటింట్లో లేకపోవటంచూసి గబగబ గదిలోకి వెళ్లింది శాంతమ్మ. గదిలో వెక్కివెక్కి యేడుస్తూ కూర్చుంది వసంత.

'ఆనోటిఘాతుకం యివాళిటిదికాదమ్మ. మొదటినుంచి అంతే. వక్కొక్కళ్ళ పుట్టుక. ఏమి అనటానికి కూడ నాకిదే భయమవమ్మా. చటుక్కున ఏమంటాడో అని. అయినా యెన్నింటికని మెదలకండా వూరుకుంటాను. కొంప అన్నతర్వాత, యిది మంచని అది చెడ్డని అనుకుంటాం. ఎంతకాలం నోరు నొక్కేసుకుని కూర్చుంటాం. ప్రతిదానికి నువ్వు మనస్సు కష్టపెట్టుకుని కూర్చుంటే, ఎన్నింటికని యేడుస్తూ కూర్చుంటావు. లే వసంతా!, నామాటవిను' వసంతను లేవతీసుకుని, శాంతమ్మ యింట్లోకి వెళ్లింది.

పదకొండు అయ్యేటప్పటికల్లా రవి హాజరయ్యాడు తయారుగా వున్నారంటూ.

ఎవరూ యేమి మాట్లాడలేదు.

'నాకు వేణు దార్లో కనిపించాడు. మనఆలస్యం యెందుకు వెళదాం రండి' రవి తొందరపెడుతున్నాడు.

'నామాట వినరా—పెద్దదాన్ని యెందుకు చెపుతున్నానో; నీకంత పట్టుదలగా వుంటే నువ్వొళ్ళు భోజనానికి.' శాంతమ్మ, మెల్లిగా అన్నది కొడుకుతో.

'నువ్వు రాకపోతే వూరుకో. నా పెళ్లాం నా యిష్టం. వసంతా...'

'అత్తయ్యా చెప్పండి' బిక్కముఖం వేసుకుని మెల్లిగా అంది వసంత.

'ఒరేయి అబ్బాయి. వకమాట చెపుతాను వింటావురా...'

ఒకమాట లేదు రెండుమాటలు లేవు. ఏదైనా వుంటే అక్కడికి వెళ్లివచ్చిన తర్వాత సావకాశంగా మాట్లాడుకోవచ్చు. ఇక ఆలస్యంచేస్తే మాటదక్కదు చెపుతున్నా' రవి గట్టిగా అనేశాడు.

'వాడితో పని యిదే వరస. మొండిపట్టుదల, వెళ్లమ్మా— ఏంచేస్తాను' శాంతమ్మ, వసంతవైపు చూసింది.

'భార్యా భర్తలు యిద్దరు కలిసివస్తున్నారు. ఇదేమన్నా బొంబాయి అనుకున్నావుటోయ్. బజార్లో చేతులు చేతులు పట్టుకు తిరగటానికి...' వక స్నేహితుడు రవిని కవ్వించాడు.

'వెధవలు, వకళ్లనుచూసి సంతోషించలేనివాళ్లు మనవూళ్లో తక్కువ అవుతేగా. బాగా యేడవనీ' గద్దించి అన్నాడు రవి.

వసంత వుక్కిరిబిక్కిరి అయిపోయింది.

'సమాధానం బాగుందా...' వసంతను చూసి పక్కన నవ్వాడు రవి. వసంతకు చచ్చిన చావుగా వుంది. తెచ్చుకున్న యెరువునవ్వే రవిని తృప్తిపరిచింది.

* * *

'ఎందుకైనా మంచిది ఆయనకు ఎడంగావుండి మాట్లాడరాదూ'— 'ఆయన తండ్రి విషయం మీకు తెలియదు గాబోలు.'

'ఈయనకు కూడా యేదో కొంచెం వున్నట్లుగానే తెలిసింది.'

'ముదరపెట్టుకోకపోతే, మొదట్లోనే మందులు తీసుకోరాదూ.'

'కర్మ తోసుకువస్తుంటే, బుద్ధులు యెందుకు పుడతాయి.'

మగవాళ్లు ఆడవాళ్లు వసంతకే వినపడాలేమో అన్నట్లు తలొక విధంగా మొదలుపెట్టారు. దానికి తగ్గట్టుగానే భోజనం మధ్యలోనే యెక్కువలు తక్కువలు చూపించారని రవి హఠాత్తుగా లేచిపోవటంతో నలుగురూ నాలుగు విధాల వ్యాఖ్యానించటం జరిగింది.

వసంతకు మళ్లీ మనోవేదన ప్రారంభమయింది. నలుగుర్లో చిన్న బుచ్చుకుని ఇంటికి వచ్చేసింది.

సావకాశంగా శాంతమ్మ బియ్యపు బస్తాదగ్గర కూర్చుని, చేటలో బియ్యం పోసుకొని రాళ్ళు యేరుతోంది.

'అత్తయ్యా మాఅమ్మదగ్గరనుంచి వుత్తరం వచ్చింది. మా పినతల్లికూతురు వున్నది వున్నట్లుగా మూర్ఛపడిపోయిందట. తర్వాత ధోరణిగా మాట్లాడటం మొదలుపెట్టిందిట. పిచ్చి అని అనుకుంటున్నారనీ వ్రాసింది. మా పిన్నికి వక్కత్తే కూతురు. ఎన్నాళ్లినుంచో పెళ్లి చెయ్యాలని ప్రయత్నం చేస్తోంది. ఇంతవరకు వక్క సంబంధం కుదర్లేదు. ఇప్పుడు చూడబోతే యిదీ వరస. పాపం యెట్లావుందో సుజాత. దాన్ని చూసికూడ చాలారోజులయింది.' వసంత విషాదంగా వుత్తరంలోకి చూస్తూనుంచుంది.

'..................'

'ఏమిటి అత్తయ్యా ..'

'...ఆ జబ్బుమాట వింటే సరి నాకు యెక్కడెక్కడివో జ్ఞాపకం వస్తాయి. ఎన్ని జబ్బులైనా భరించచ్చుగాని, ఈ జబ్బుతో భరించటం కష్టం తల్లీ. పగవాళ్లకు కూడా యిలాంటి జబ్బు రావద్దని భగవంతుణ్ని ప్రార్థిస్తూవుంటాను' శాంతమ్మ తన ధోరణిలోకి పూర్తిగా వెళ్లిపోయింది.

వసంత వక్కక్షణం ఆగి 'అత్తయ్యా పిచ్చితగ్గటం అంటూ కూడా వుంటుందా' అంటూ ఆదుర్దాగా అడిగింది.

'ఎందుకులేదమ్మ నా దురదృష్టం కాని...' శాంతమ్మ పెద్ద నిట్టూర్పు విడిచింది.

'పూర్తిగా తగ్గిపోయినతర్వాత మళ్ళీరావటం అంటూ వుండదుకాదూ?'

'ఎందుకు చెప్పు నీకు యీ ప్రశ్నలన్నీ, నీపనులేమిటో నువ్వు చూసుకోక...ఆ జబ్బు రాకుండా వుండాలే కాని, చంద్రుడి కళల మాదిరి...'

ఆశ్చర్యంగా శాంతమ్మవంక చూసింది వసంత.

'ఏమిటి అట్లా చూస్తున్నావు.'

'ఎంలేదు. మా సుజాత యిక యింతేనన్నమాట!'—వసంత కళ్ళల్లో రవి చేష్టలన్నీ వకసారి మెరిసినాయి. అక్కడ వక్కక్షణం వుండలేకపోయింది. వెంటనే గదిలోకి వెళ్లి యేదో వక పుస్తకము తెరిచింది, వాటన్నింటినీ మరిచేపోదామన్నట్లు. కాని పేజీ పేజీలోను, రవి ప్రతిబింబం, రవినిగురించి నలుగురు అంటున్న మాటలే కనిపిస్తున్నాయి. భయం వేసింది వసంతకు. వెంటనే పుస్తకము మూసేసి మళ్లీ సావిట్లోకే వచ్చి శాంతమ్మదగ్గర కూర్చుంది.

ప్రక్క గదిలోనుంచి పెద్దగా పాటలు వినిపిస్తున్నాయి.

'ఏమిటిరా ఆ పొలికేకలు. మెల్లిగా పాడుకోరాదూ? ఏదొచ్చినా నీతో యిదేతంటా'—శాంతమ్మ అతి తేలికగా అనేసింది.

వసంత మెల్లిగా లేచి మళ్లీ గదిలోకే వెళ్లింది. గదిలో పెట్టెలు సవిరిస్తోంది;

'అత్తయ్యా, యీ ఫొటోలన్నీ యెవరివి' వక్కొక్కటి ఆశ్చర్యంగా తీస్తూ అడిగింది వసంత.

'అవన్నీ యెందుకు కెలుకుతున్నావు. ఆ పెట్టె ముట్టుకోవద్దని చెప్పలేదు' విసుగ్గా లేచింది శాంతమ్మ.

వసంత యేమీ మాట్లాడకండా పెట్టె మూసేసి అక్కడినుంచి వెళ్ళిపోయింది.

మెల్లిగా శాంతమ్మ, రవివున్న గదిలోకి నడిచింది. రవి పాటలు మానేసి ఏవో పుస్తకాలు తీస్తున్నాడు.

'ఏమిటి సవిరిస్తున్నావు'

'ఏంలేదులే. నీకు కావాలసిందేమిటో చెప్పరాదు.'

'నేను చెప్పటం వంతేకాని, నువ్వేమన్నా చేస్తావు గనకనా...మళ్ళీ రాత్రి వకటే కలవరింపు. నేను యెన్ని చెప్పినా నీకు చీమకుట్టినట్లుగా నన్నా వుండదు. నాకు బాగా అనుమానంరా నాయనా! నేను యెట్లా చావను. నువ్వు వెళ్లి ఆ విషయ మేమిటో చూడరా! నేను యిన్నీ వాగుతూనే వుంటా నువ్వు చేసేదేమిటో చేస్తూనే వుంటావు' శాంతమ్మ అన్నది.

రవి ఆలోచించటం మొదలుపెట్టాడు. తల్లి యెన్నిసార్లు చెప్పినా పెడచెవిన పెట్టి యెగతాళి క్రింద కట్టేస్తూ వచ్చాడు యింతవరకు, వసంత ప్రవర్తన, తన తల్లి యొక్క అనుమానానికి సరిపోతూనే వుంది.

'నాన్న పోయేనాటికి వసంత యెవరో నాన్నకేమీ తెలియదు గదా, మరి నాన్నకల్లోకి రావటమేమిటి?' తనకేమీ అర్థంకావటంలేదు యీ ప్రశ్న యెందుకు అడుగుతున్నాడో. అస్పష్టంగా యేవేవో ఆలోచనలు తన మనస్సును కలవరపరుస్తున్నాయి. అటు తన నమ్మకాలమీద పూర్తిగా విశ్వాసం వుంచలేకపోతున్నాడు. ఇటు తల్లిమాటలను పూర్తిగా నమ్మలేకపోతున్నాడు రవి.

'ఎవరు చెపుతారు వీటికి సమాధానం. ఇదంతా కర్మ అని వక్కటేమాట అని వూరుకుంటే మంచిది. నన్ను, నా భార్యను సుఖంగా వుండేటట్లు చెయ్యమని ఏ దేవుడికైనా మొక్కుకోరా!'

రవి మళ్లీ కాసేపు ఆలోచనల్లోకి దిగాడు.

'దానికి తగ్గట్టుగానే నువ్వూను. నీ కెప్పుడు వస్తుంది జ్ఞానం. ఇన్నేళ్లు వచ్చినా యెవరితో యెట్లా మాట్లాడాలో తెలియకపోయె. అందులో క్రొత్తగా కాపరానికి వచ్చిన భార్యతో యిట్లాగా నువ్వు వుండాలిసింది?' మళ్లీ శాంతమ్మ అంటుకుంది.

'సరేలే. అవన్నీ అట్లా వుంచు. ఇప్పుడు చెయ్యాలిసిందేమిటో చెప్పరాదూ?' తననుగురించి కటువుగా తల్లినోటివెంబడైనా వినటం యిష్టపడలేదు రవి.

'రేపు ఆదివారం. అయన్ను మనింటికి రమ్మను. చేతనయినవన్నీ చేద్దాం. తర్వాత పరమేశ్వరుడి దయ'

వసంత వక్కత్తే వంటరిగా అవతలగదిలో కూర్చునివుంది. వంటరిగా కూర్చుంటేనే, ఎవరి ఆలోచనలైనా పెడదోవనపట్టేది, మనస్సు సరిగ్గా లేకపోతే. ప్రొద్దస్తమానం, వసంతచుట్టూ యెవరు వుంటూవుంటారు కనక. ఏ కాసేపు ఏకాంతంగా కూర్చోటానికి అవకాశం చిక్కినా వసంత ఆలోచనలన్నీ నలుగురూ అంటున్నమాటల్లోకి పోతూ వుంటాయి. 'చిన్నప్పుడు కొద్దిగా అనుమానంవేసి ఆసుపత్రిలో చేర్పించారుటకూడా. పిచ్చిఅన్న తర్వాతతగ్గటమేమిటి కొన్నాళ్లు తగ్గినట్లుంటుంది, మళ్లీకొన్నాళ్లు హెచ్చుతూవుంటుంది. నిజంగా చక్కని చుక్క. అలాంటిపిల్ల గొంతికకు వురిపోశారు' ఈమాటలన్నీ వసంత చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. కడుపులోనుంచి నెట్టుకువస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది. కడుపారాయేడ్చింది. కొడుకుకునచ్చచెప్పి, వస్తున్న శాంతమ్మ అడుగులచప్పుడు వినేటప్పటికి, వసంత యేదోపనిచేస్తున్నట్లు నటించేటప్పటికి శాంతమ్మకూడా యిటువైపుకు తిరగకుండానే తనపనిలోకి వెళ్ళిపోయింది.

ఆదివారంనాడు వసంతను సావిట్లో పీటమీద కూర్చోపెట్టారు. ఎదురుగా వకాయన ముఖంఅంతా నిండిపోయిన కుంకంబొట్టుతో, మంత్రాలుచదవటం

మొదలుపెట్టాడు. వసంతకు రెండువైపులా అత్త, భర్త నిలబడివున్నారు. హఠాత్తుగా ఆయన లేవటంతో, వసంతకూడా పీటమీద కూర్చోలేకపోయింది.

'ఇంకా చూస్తావేమిటయ్యా, పట్టుకోరేం. నేను లేస్తే దయ్యం కూర్చోటమే' అంటూ ఆయన గద్దించాడు.

రవి, శాంతమ్మలు, బలవంతంగా వసంతను పట్టుకువచ్చి, మళ్లీ ఆ పీటమీద కూర్చోపెట్టారు. చేతివిసురున, ఆయన బలంగానేకొట్టాడు. అంతదెబ్బ ఆస్థితిలో వసంతకు మించినదయింది. వున్నదివున్నట్లుగా కూలబడిపోయింది. జాలిపడినట్లు యెవరూకనిపించలేదు. లేవదీసి మంచంమీదమాత్రంపడుకోపెట్టారు. ఆ సాయంత్రంనుంచీ కొంచెంగాజ్వరంకూడా ప్రారంభమయింది వసంతకు. శాంతమ్మకు కాళ్లూచేతులు ఆడటంలేదు. రవి నుదురన చెయ్యిపెట్టుకొని, మంచం దగ్గర కుర్చీవేసుకుని కూర్చునివున్నాడు.

'ఎవరుచెప్పింది దయ్యంపట్టిందని? ఏమిటయ్యా నీకన్నావుండొద్దూ? చూడు పిల్లని యెంతదెబ్బ కొట్టారో. ఈమందు యివ్వాళ రేపు యివ్వండి మళ్లీ యిలాంటి పిచ్చిచేష్టలు ఎప్పుడూ చెయ్యకండి. రోగాలు తెచ్చిపెట్టుకుంటారేమిటి?'— చనువుగానే చివాట్లు వేసిపోయాడు డాక్టరు.

మళ్లీ ఆదివారంకోసం యెదురుచూస్తోంది శాంతమ్మ. ఆమె లెక్కలో మూడువారాలు జరగాలని.

'అత్తయ్యా డాక్టరుగారు చెప్పిందినిజం. నాకేమీ లేదు, అసలు ఆ దెబ్బవల్లనే యింతజ్వరంరావటం. నామాటనమ్మండి, నాకేమీలేదు' దుఃఖము ఆపుకోలేకపోయింది వసంత.

'అట్టే వుద్రేకపడక కాసేపు విశ్రాంతిగా పడుకో' శాంతమ్మ దుప్పటికప్పేసి వెళ్లిపోయింది.

సావిట్లో జరుగుతున్న తతంగంఅంతా వసంత, దుప్పటిముసుగులోంచి చూస్తూనేవుంది, క్రిందటి ఆదివారం జ్ఞాపకంవచ్చింది.

ఇంకా ఆదెబ్బనెప్పి పూర్తిగా తగ్గనేలేదు. మెల్లిగా అటుయిటుచూసి, వసంతలేవబోతోంది.

'అమ్మాయి వసంతా. నీకేమీభయంలేదు, ఈసారి నిన్నేమిచెయ్యరు. కాసేపు ఆపీటమీదకూర్చో అంతే, ఈపూజకూడాచేయిస్తే, అంతా సరిగ్గా వుంటుంది.' శాంతమ్మ, వసంత చెయ్యిపట్టుకుంది.

ఎదురుగుండావున్న రవిని చూడలేకపోయింది వసంత. వసంతనుచూసి జాలిపడుతున్నట్లు, ముఖం అటుత్రిప్పేశాడు రవి.

'ఏమిటండీ, అమ్మాయి నాకేమీలేదంటుంది. డాక్టరుగారుకూడా అదేమీ లేదంటున్నాడు...' శాంతమ్మ సగంలో ఆపేసింది ఆయనవంకచూస్తూ.

'డాక్టరుగారు అట్లాచెప్పకపోతే ఆయనకు డబ్బెవరిస్తారు వృత్తిలోవున్నవాళ్లు అట్లాగేమాట్లాడుతారులెండి. ఏడాక్టర్నైనా అడగండి యీమాట వప్పుకుంటాడేమో. నాకుపలికిందిగదా...' ఆయన మళ్లీ ప్రారంభించబోతున్నాడు.

'అవును మీరుచెప్పినమాట నిజమే. డాక్టర్లు అట్లాగే చెపుతారులెండి' శాంతమ్మకూడా వంతపాట పాడింది.

ఈసారి దెబ్బలుమినహా అంతా జరిగిపోయింది. వసంతకు ఆట్టేబాధలేదు. ఆవిధంగా మూడువారాలు జరిగిన తృప్తి శాంతమ్మకు దక్కింది. కాని రానురాను, వసంతను, రవిని చూస్తూవుంటే శాంతమ్మకు మతి స్థిమితంగా వుండటంలేదు. శాంతమ్మప్రవర్తన చూస్తూవుంటే నిజంగా ఆమెకు పిచ్చియెత్తిందాఅనే అనుమానం, రవికి, వసంతకు బాగాకలుగుతోంది. రవి యిక వక్కక్షణంగూడా ఆ యింట్లోవుండి నిర్వహించుకునే స్థితిలోలేడు. ఎన్నాళ్ళనుంచో కాశీవెళదామనుకుంటున్న శాంతమ్మకు గట్టిగావెళ్లాలనే పట్టుదలకూడా యెక్కువయిపోయింది వకమూల వసంత తల్లి అయ్యే రోజులుకూడా దగ్గరకువస్తున్నాయి.

ఆనాడు సామానుసర్దుకుని రవి పట్నానికి బయలుదేరాడు, రవివెళుతూవుంటే గదిలోంచి వసంత, రవి తనను చూడనంతసేపూ, అతనివంకే చూస్తూకూర్చుంది. శాంతమ్మ గడపదాక వెళ్లిందేకాని యేమీమాట్లాడలేదు. రవి హడావిడిగా బండీలోకి యెక్కేశాడు.

శాంతమ్మ, వియ్యపురాలి వారింటి దగ్గరనుంచి, కోడలిని తీసుకుపోవటానికి యెప్పుడొస్తారా అంటూ యెదురుచూస్తోంది. తన కాశీప్రయాణానికి యిదొకటే అడ్డం. రవి వెళ్ళినప్పటినుంచీ, అత్తగార్ని చూస్తూవుంటే, వసంతకు అదివరకున్న భయంలేదు. శాంతమ్మ

దృష్టిలోకూడా వసంత కొంచెంగా మారింది. ఏమి మారినా, యిద్దరూకూడా, యెవరిచోటుకు వాళ్లు యెప్పుడు వెళదామాఅనే ఆదుర్దాలోనేవున్నారు.

సంధ్యవెలుతురు పోతూపోతూ వుండగా, వోరు వాకిలిగా వున్నతలుపు తీసుకుని, బండీమనిషి పెట్టె లోపల పెట్టాడు. వెనకాలే లలితమ్మకూడా వచ్చింది, ఆదుర్దాగాలోపిలికిచూస్తూ.

'అమ్మా' అంటూ అమాంతంగా వసంతవెళ్లి, లలితమ్మ వళ్లోపడ్డది. లలితమ్మకూడా దుఃఖము ఆపుకోలేక పోయింది. పాపిష్టిదాన్ని, తల్లినిబ్రతికి వున్నాకూడా, నిన్ను యీస్థితిలోగాని చూడలేక పోయాను. అనుకుందిలలితమ్మ. వున్న ఆకొద్దిగంట ల్లోను, లలితమ్మ ముళ్ళమీద వున్నట్లేవుంది. అంతా క్రొత్తగాఅనిపిస్తోంది. పట్టుబలవంతానమాత్రం అల్లుడు యెక్కడ అని అడిగగలిగింది. దానికి సమాధానంకూడా వూరువెళ్లాడు అంటూ అంతటూకీగానే వచ్చింది. లలితమ్మ యింకాయేదో అడుగుదామనుకుంటుంటే సంజ్ఞచేసి వసంత ఆపింది.

వసంత వెళ్లినమర్నాడే, శాంతమ్మకూడా కాశీకి బయిలుదేరింది.

కాశీచేరుకున్నట్లు వచ్చినవుత్తరం మినహా, రవికి తన తల్లిదగ్గరనుంచి యింకో వుత్తరం యేమీలేదు. కాశీలో యెక్కడికి పోయినా శాంతమ్మ మాత్రం మొక్కుకుంటూనేవుంది, కొడుకు, కోడలుసరిగ్గా వుండాలని. అక్కడవున్న నెలరోజులు కూడా శాంతమ్మ మనస్సు ప్రశాంతంగా వుండిపోయింది. అప్పుడప్పుడు వెనకటివి జ్ఞాపకం వస్తున్నాకూడా అక్కడి వాతావరణం, వెంటనే మరిపించిచేస్తోంది కూడా. ఎక్కువ భక్తికుదిరిందేమో అనిపిస్తోంది శాంతమ్మకు. తనకొడుకు, ఉద్యోగం కుదిరిందని వ్రాసిన వుత్తరానికి కూడా యేమీసమాధానం వ్రాయ లేదు. అంతా విశ్వేశ్వరునిదయ అని వకనమస్కారం పెట్టింది.

తన తల్లిదగ్గరనుంచి వుత్తరంరాకపోవటంతో రవి యేదోరకంగా ఆలోచించటం మొదలు పెట్టాడు. రెండువుత్తరాలకు సమాధానంలేదు. వసంత, పుట్టింటికి పోయిన క్రొత్తలోమాత్రం, తనబావమరిది వ్రాసిన వుత్తరం వక్కటే తనకుఅదింది. వసంతపేర వుత్తరం వ్రాయాలని, తనకువుద్యోగం దొరికింది, మంచియిల్లు కూడా చూశాను. నేనువచ్చినిన్ను తీసుకపోతాను, పాపాయితోసహా అని యింకాయెన్నెనో వ్రాయాలని మరిసిపోయాడు. ఎప్పటికప్పుడు వుత్తరం వ్రాయటం మొదలుపెట్టటం, మళ్లీయేదో ఆలోచనవచ్చి, ఆప్రయత్నాన్ని భగ్నంచెయ్యటం జరుగుతూ వచ్చింది. పోనీ తను వ్రాయకపోయినా, బావమరిదైనా యేదైనావుత్తరం వ్రాయాలికదా అని యెదురు చూశాడు. పురుడు వచ్చిందా అని వ్రాయటానికి సిగ్గుపడ్డాడు. ఏదోతీరని బాధ, ఆవేశం, రవిలో ప్రవేశించినాయి. తనకువుద్యోగం రావటంవల్ల, తల్లీ, భార్య సంతోషించారన్న తృప్తి తానుపొందలేక పోతున్నాడు. తల్లికి వుత్తరం వ్రాసినా సమాధానంరాలేదు. ఏమైనాతాను, వసంత పేర వుత్తరం వ్రాయాలనే పట్టుదలతో వుత్తరంపూర్తి చేశాడు. సంతోషంగా వాకిట్లోకి వెళ్ళబోతూవుండగా, పోస్టుమన్ వచ్చి వక వుత్తరం యిచ్చిపోయాడు.

'...మగపిల్లాడు...బారసాల పైబుధవారం—' రమ్మని బావమరిదినుంచి ఆహ్వానం. సంతోషం పట్టలేకపోయాడు. తాను వసంతపేర వ్రాసినవుత్తరం మళ్లీ ఒకసారిచదువుకుని, డ్రాయర్లో భద్రంగా దాచాడు. తాను ఆవూరువెళ్లినప్పుడు వసంతకు యివ్వాలని, వెంటనే తనతల్లిపేర ఫలానారోజు బారసాల రమ్మని వకవుత్తరం వ్రాశాడు. సాయంత్రం ఆఫీసు వదిలిపెట్టినతర్వాత యింటికివచ్చేసి సావకాశంగా, తాను బారసాల ప్రయత్నంలో యేవేవికొనాలో ఒక పెద్దలిస్టు తయారుచేసుకుంటున్నాడు. మంగళవారం నుంచే నాలుగురోజులు శలవుపెట్టేద్దామనికూడా అనుకుంటున్నాడు. అతనివ్యూహాలు, అతనిఆలోచనలు అన్నీ సంతృప్తిగానే కనిపిస్తున్నాయి. కాని తనతల్లి మాట అనుకుంటుంటే యేదో ఆలోచనపోతోంది. వుత్తరంవచ్చి చాలారోజులయింది. ఇంకా కాశీలోనే వుండివుంటుందా, బయలుదేరివుంటే తనవుత్తరం అందదు గదా, చివరకు తల్లిరాకుండా బారసాల చేసుకోవటమా తన మనస్సు యే ఆలోచనమీదా నిలకడగా వుండటంలేదు. లేచి మెల్లిగా బయలుదేరాడు, తాను వ్రాసినలిస్టు జేబులోకి మడుస్తూ.

తలుపుతట్టుతూ పోస్టుమన్ వచ్చాడు 'టెలిగ్రాం' అంటూ.

తనతల్లి రేపువుదయమే యీ వూరువస్తోంది. అనుకోకుండా బయలుదేరటంవల్ల వుత్తరం వ్రాసే వ్యవధిలేక టెలిగ్రాం యిచ్చింది. చాలామంచిపని చేసిందనుకున్నాడు.

ఎదురుచూస్తున్న ముహూర్తం దగ్గరకువచ్చేస్తోంది. వసంత, పాపాయిని వూహించుకుంటూ, తల్లీ కొడుకులు రైలుదిగారు.

ఒళ్లోపాపాయిని పెట్టుకున్న వసంత, అప్సరస లాగ కనిపించింది రవికి. రవినిచూసి, ముసిముసినవ్వులు నవ్వుకుంటూ తలవంచుకుంది వసంత.

సాయత్రం, సావకాశం చూసుకుని, చాటుగా వియ్యపురాలితో అమ్మాయి సరిగ్గా వుంటోందా అని అడిగింది మెల్లిగా శాంతమ్మ.

'అల్లుడుగారికి యీమధ్య యేదో అనుకున్నారట ఇప్పుడుబాగా కులాసాగా వుంటోందా అండి?' అని యెదురు ప్రశ్న వేసింది లలితమ్మ.

వీళ్లిద్దరూ వకళ్ళ మొహంవంక వకళ్ళు ఆశ్చర్యంగా చూసుకుంటున్నారు. ఇంతలో పాపాయితో సహా, రవి వసంతలు కిలకిలనవ్వుతూ వచ్చేశారు.

శాంతమ్మకు సమాధానం, రవిమొహంలోను, లలితమ్మకు సమాధానం వసంత మొహంలోను దొరికినాయి.


# రెండు మహానగరాలు

మూలం : **చార్లెస్ డికెన్స్**

అనువాదకులు :

## శ్రీ తెన్నేటి సూరి

అది ఒక వైభవోజ్వల మహాయుగం—వల్లకాటి అధ్వాన్నశకం; వెల్లివిరిసిన విజ్ఞానం—బ్రహ్మ జెముడులా అజ్ఞానం; ఆశాకుసుమాలు పుష్పించిన ఆమధురవసంతం—నైరాశ్యపు చలిగుబుళ్ల యీచుకున్న శిశిరాస్యం; సర్వసంపత్సమృద్ధి—సర్వతోముఖ క్షామం; సూక్ష్మంగా చెప్పాలంటే—నేటి పరిస్థితికి నకలుగా వుందినాటి పరిస్థితి.

అలాంటి కల్లోలదినాలలో లండన్ పారిస్ నగరాలను రెంటినీ పెనవేసుకుని సాగిన ప్రణయబలిదాన గాథ! ఆంగ్ల నవలా ప్రపంచ నిర్మాత చార్లెస్ డికెన్సు ప్రతిభా సంపత్తులు వెల్లివిరిసిపోయిన "టేల్ ఆఫ్ టూ సిటీస్" అనే 'క్లాసికల్' నవలకు అనువాదం.

**ఆంధ్రగ్రంథమాల, మదరాసు-1.**